RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :196 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 01 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 196 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 01 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## విద్వేష ప్రసంగాల కట్టడికి యంత్రాంగం : సుప్రీం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశంలో కొందరు వ్యక్తులు చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాలను పరిశీలించేందుకు పాలనాపరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు సుప్రీం కోర్టు తెలిపింది. ఒక్కో కేసును వ్యక్తి గతంగా పరిశీలించడం సాధ్యం కాదని, దీని వల్ల కేసుల ప్రవాహం పెరుగు తుందని వ్యాఖ్యానించింది. విద్వేష ప్రసంగాలను న్యాయస్థానం నిర్వచిస్తోందని అంటూ

మిగతా 2లో




# పోలింగ్ ప్రశాంతం..!

## అత్యధికం మెదక్.. అత్యల్పం హైదరాబాద్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


గత రెండు అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా తెలంగాణలో గురువారం ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో 5 గంటల వరకూ 71.89 పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అత్యధికంగా మెదక్ జిల్లాలో 69.33 శాతం, అత్యల్పంగా హైదరాబాద్ లో48.17 శాతం నమోదైనట్లు చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే పోలింగ్ ముగియగా, మరికాసేపట్లో 106 చోట్ల ఓటింగ్ ముగియనుంది.కొన్నిచోట్ల విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. తమ చుట్టుపక్కల వారికి డబ్బులు పంచి, తమకు ఏం ఇవ్వకుండా మోసం చేశారంటూ ఓటర్లు రోడ్డెక్కుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో లో అయితే కొందరు మహిళలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఏం జరిగిందని అడిగితే.. పట్టణంలో పలు వార్డుల్లో నగదు పంచారు, కానీ తమకు డబ్బులు ఇవ్వలేదంటూ ధర్నాకు దిగారు. అభ్యర్థి నుంచి కౌన్సిలర్లు తీసుకున్న నగదు తమకు ఇవ్వకుండా వానే స్వాహా చేశారని ఆరోపించారు. వైరా నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా ఎన్నికలను బహిష్కరించారు. ఏన్కూరు మండలం కొత్త మేడేపల్లి గ్రామంలో రోడ్డు, తాగునీటి సౌకర్యంతో సహా మౌలిక వసతులు కల్పించడం లేదని మండిపడ్డారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఓటు వేయాల్సిన అవసరం లేదని వారు చెబుతున్నారు. అధికారులు ఎంత నచ్చజెప్పినా వినలేదు. తమకు నేతలపై నమ్మకం పోయిందన్నారు. మంథనిలో 288 పోలింగ్ స్టేషన్స్ ఉండగా, 2,36,442 మంది ఓటర్లున్నారు. మొత్తం 82 శాతం పోలింగ్ నమోదు కాగా 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాగా గత ఎన్నికల్లో 85.14 శాతం పోలింగ్ నమోదైంది. భారీ భద్రత నడుమ ఈవీఎంలను పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని జేఎన్టీయూ కాలేజీ స్ట్రాంగ్ రూంలో భద్రపరచనున్నారు.రాష్ట్రంలో 3 గంటల వరకూ 51.89 పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అత్యధికంగా మెదక్ జిల్లాలో 69.33 శాతం, అత్యల్పంగా హైదరాబాద్ లో 31.17 శాతం నమోదైనట్లు చెప్పారు. ఆదిలాబాద్ 62.3, భద్రాద్రి 58.3, హన్మకొండ 49, హైదరాబాద్ 31.17, జగిత్యాల 58.6, జనగాం 62.2, భూపాలపల్లి 64.3, గద్వాల్ 64.4, కామారెడ్డి 59, కరీంనగర్ 56, ఆసిఫాబాద్ 59.62, మహబూబాబాద్ 65.05, ఖమ్మం 63.6, మహబూబ్ నగర్ 58.8, మంచిర్యాల 59.1, మేడ్చల్ 38.2, ములుగు 67.8, నాగర్ కర్నూల్ 57.5, నల్గొండ 59.9, నారాయణపేట 57.1, నిజామాబాద్ 56.5, నిర్మల్ 60.3, పెద్దపల్లి 59.2, సిరిసిల్ల 56.6, రంగారెడ్డి 42.4, సంగారెడ్డి 56.23, సిద్దిపేట 64.9, సూర్యాపేట 62.07, వికారాబాద్ 57.6, వనపర్తి 60, వరంగల్ 52.2, యాదాద్రి 64 శాతంగా పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారుఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సత్యంపేటలోనూ పోలింగ్ ను బహిష్కరించారు. తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని, తాము ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు గిరిజనులు. అయితే తమకు ఎవరూ అభివృద్ధి చేయకపోతే నోటాకు ఓటు వేసే ఛాన్స్ ఉందని అధికారులు చెప్పినా వారు వినలేదు. గ్రామ పంచాయతీ చేయలేదని ఆగ్రహం!కొన్నిచోట్ల డబ్బులు పంచలేదని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలింగ్ ను బహిష్కరించారు. అయితే ఇందుకు భిన్నంగా బెల్లంపల్లి నియోజకవర్గం కాసిపేట మండలంలోని వరిపేట గ్రామస్తులు ఓటింగ్ కు దూరమయ్యారు. తమ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా చేయలేదని నిరసనగా ఎన్నికలకు దూరంగా ఉండటంతో అధికారులు రంగంలోకి దిగి వారితో చర్చలు జరుపుతున్నారు.



ఆదిలాబాద్ జిల్లా కొత్తపల్లిలో తమకు రోడ్డు సౌకర్యం కల్పించలేదని నిరసనగా గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ప్రభుత్వాలు మారుతున్నా తమకు సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. మరోవైపు మహబూబాబాద్ లో ఓటర్లు నగదు డిమాండ్ చేశారు. బయ్యారం మండలం సంతులాల్ పోడు గ్రామపంచాయతీ పరిధిలోని సంతులాల్ పోడు ఎస్సీ కాలనీ ఓటర్లు తమకు డబ్బులు పంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు పంచితేనే ఓట్లు వేస్తామని తేల్చి చెప్పడంతో అధికారులు షాకయ్యారు. రాష్ట్రంలోని 13 నియోజకవర్గాల్లోని మొత్తం 600 కేంద్రాల్లో పోలింగ్ ముగిసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, పినపాక, ఇల్లందు, భద్రాచలం, సిర్పూర్ టీ, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, అశ్వారావుపేట, కొత్తగూడెం, ములుగులో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. అయితే, క్యూలో ఉన్న వారిని ఓటేసేందుకు అధికారులు అనుమతిస్తున్నారు.

## 4 నుంచి పార్లమెంట్

### - 18 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 4 నుంచి ప్రారంభమై.. 22వ తేదీ వరకూ కొనసాగుతాయి. ఈ సమావేశాలలో మోడీ ప్రభుత్వం 18 బిల్లులను ప్రవేశపెడుతుంది. మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలను జమ్మూకాశ్మీర్, పాండిచ్చేరికి కూడా వర్తింపజేసేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులు, క్రిమినల్ చట్టాల స్థానంలో తీసుకొస్తున్న మూడు బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం ఓ బులెటిన్ విడుదల చేసింది. జమ్మూకాశ్మీర్ శాసనసభ స్థానాల సంఖ్యను 107 నుంచి 114కు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును కూడా ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెడుతుంది. కాశ్మీర్ వలసవాదులు, పాక్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్ నుండి వచ్చిన వారు, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ బిల్లును తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఈ బిల్లులతో పాటు 2023-24 సంవత్సరపు గ్రాంట్లకు సంబంధించి తొలి విడత అనుబంధ డిమాండ్లను కూడా సభ ముందు ఉంచుతారు. ఈ

మిగతా 2లో

# జనగామలో హైటెన్షన్

## పలు చోట్ల ఘర్షణ వాతావరణం - ఈవీఎంల మొరాయింపు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 244 పోలింగ్ కేంద్రానికి బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి రాగా.. ఆయన వెంట వచ్చిన కార్యకర్తలు బూత్ బయటే ఉన్నారు. పల్లా ఈవీఎంలను పరిశీలిస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి బూత్ దగ్గరికి వచ్చి.. ఇంతమంది పోలింగ్ బూత్ వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దాంతో ఓ బీఆర్ఎస్ కార్యకర్త శ్రీను.. వస్తే మీకేం ఇబ్బంది అనడంతో అక్కడే ఉన్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత రెడ్డి సహా మరికొందరు కలిసి శ్రీనుపై దాడి చేశారు. దాంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో అరగంటకు పైగా పోలింగ్ నిలిచిపోయింది. వెంటనే జనగామ సీఐ శ్రీనివాస్ యాదవ్, టాస్క్‌ఫోర్స్ సీఐ బాబూలాల్ తదితర సిబ్బంది అక్కడున్న వారిని చెదరగొట్టారు. బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనుని పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. పల్లా రాజేశ్వర్ రెడ్డి విడిపించుకుని వెళ్ళిపోయాడు. జనగామ



వ్యవసాయ మార్కెట్ సమీపంలోని మరో బూత్‌లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు గొడవకు దిగారు. దాంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని పెరిక ్షడలో పోలింగ్ మరికొద్దిసేపట్లో ముగుస్తుందనే సమయానికి ప్రజలు, యువకులు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దాంతో పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ దాడిలో 33వ డివిజన్‌కు చెందిన యువకులు అవినాష్, సతీష్ తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించారు. కాశీబుగ్గ పరిధి 20వ డివిజన్‌లోని శాంతినగర్

మిగతా 2లో

# 4 నుంచి పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్లపై శీతాకాల సమావేశాలలోనే చర్చించి ఆమోదిస్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వర్షాకాల సమావేశాలలోనే ఆమోదించారు. అయితే ఈ బిల్లును జమ్మూకాశ్మీర్, పాండిచ్చేరికి వర్తింపజేయలేదు. ఆయా కేంద్రపాలిత ప్రాంతాల పాలనా వ్యవహారాలకు సంబంధించిన ఆర్టికల్ 239ఎ, 239ని అందులో చేర్చకపోవడంతో ఆయా ప్రాంతాలకు మహిళా రిజర్వేషన్ బిల్లును వర్తింపజేయలేదు. ఐపీసీ (1860), ఇండియన్ ఎవిడెన్స్ చట్టం (1872), సీఆర్‌పీసీ (1898) స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లులను ప్రవేశపెడతారు. ఇటీవల బీజేపీ ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ ఈ బిల్లులకు 50కి పైగా సవరణలు సూచించిన విషయం తెలిసిందే.

# విద్వేష ప్రసంగాల కట్టడికి యంత్రాంగం : సుప్రీం

(మొదటి పేజీ తరువాయి)

అయితే దీనిని ఎలా అమలు చేయాలి, ఎలా వర్తింపజేయాలి అనేదే ప్రశ్న అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఎస్‌వీఎన్ భట్టితో కూడిన బెంచ్ పేర్కొంది. 'ఒక్కో కేసును వ్యక్తిగతంగా పరిష్కరించలేము. ఒకవేళ అలా చేయడం మొదలుపెడితే కేసుల సంఖ్య పెరుగుతుంది. దానికి బదులు మౌలిక సదుపాయాన్ని లేదా పాలనాపరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఒకవేళ అక్కడ ఏదైనా ఉల్లంఘన జరిగితే మీరు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చు' అని సుప్రీం బెంచ్ వివరించింది. పాన్ ఇండియా కేసులు చేపట్టడం సాధ్యం కాదని, వాటిని పరిష్కరించడం అసంభవమని తెలిపింది. 'భారత్ వంటి పెద్ద దేశంలో సమస్యలు ఉంటాయి. అవసరమైనప్పుడు చర్య తీసుకునే పాలనా యంత్రాంగం మన వద్ద ఉన్నదా అనేదే ఇక్కడ ప్రశ్న. విద్వేష ప్రసంగం చేస్తే ప్రభుత్వం చర్య తీసుకుంటుందన్న విషయం సమాజానికి తెలియాలి' అని వ్యాఖ్యానించింది. కాగా నోడల్ అధికారులను నియమించని తమిళనాడు, కేరళ, నాగాలాండ్, గుజరాత్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

# జనగామలో హైటెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ బూత్ వద్ద వరంగల్ తూర్పు బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపనేని నరేందర్‌కు.. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఎదురుపడి.. 'బారు బారు నరేందర్' అంటూ చేతులు ఊపడంతో ఎమ్మెల్యే వెంటనే కారు దిగి అతనిపై దుర్భాషలాడారు. "ఎన్నికల అనంతరం నిన్ను చౌరస్తాలో నిలబెడతా" అంటూ కార్పొరేటర్ ఎదురుదాడికి దిగారు.



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడలోని 219 పోలింగ్ కేంద్రంలో ఉదయం ఏడు గంటలకు ఓటు వేయడానికి వెళ్లిన యువకులు ఓటు వేయకుండా క్యూలో నిలబడి కారు గుర్తుకే ఓటేయాలని ప్రచారం చేస్తుండగా ఓటర్లు అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. డీఎస్పీ వెంకటేశ్వర బాబు, ఎస్ఐ పవన్ కుమార్ ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం ఎమ్మెల్యే కొడుకు రవిచంద్ర పోలింగ్ కేంద్రంలోకి రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరాన్ని తెలుపుతూ ఆందోళన చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైతం పోలింగ్ కేంద్రంలోకి వెళ్ళడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డగించారు. దాంతో మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష, డీఎస్పీ వెంకటేశ్వర బాబు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానిక జర్నలిస్టులు, మీడియా కవరేజ్ కోసం వెళ్ళి ఫోటోలు తీసిన విలేఖరి సెల్ లాక్కొని ఫొటోలు డిలీట్ చేశారు. ములుగు జిల్లా పరిధి కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటర్లు అధిక సంఖ్యలో రాగా వారిని నివారించాల్సిన సీఆర్పీఎఫ్ పోలీసులు ఓటర్లను చితకబాదారు. గమనించిన స్థానికులు క్యూలైన్లో ఉన్న ఓటర్లందరూ పోలీసులపై తిరగబడ్డారు.

ఈవీఎంల మొరాయింపు

జనగామ జిల్లా నర్మెట్ట మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఒక్క ఓటు వేయడానికి 20 సెకన్లు పడుతుందని ఓటర్లన్నారు. దాంతో సాయంత్రం 5 గంటలు దాటినా ఓటర్లు ఓటు వినియోగించుకోవడానికి క్యూలైన్‌లో ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం వెలికట్ట, నాంచారి మడూరులో వీవీప్యాడ్లు మొరాయించాయి. దాంతో గంటల కొద్దీ లైన్‌లో ఉన్న మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

# ఎన్నికలను బహిష్కరించిన ఏజెన్సీ గ్రామం

ములుగు జిల్లా ఏటూర్‌నాగారం మండలంలోని అల్లవారి గణపురం గ్రామపంచాయతీ పరిధి మారుమూల ఏజెన్సీ గ్రామమైన ఎలిసెట్టిపల్లిలో ఓటర్లు గురువారం ఎన్నికలను బహిష్కరించారు .ఎన్నో ఏళ్ల నుంచి జంపన్నవాగులో బ్రిడ్జిలేక నానతంటాలు పడుతున్నా ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోలేదన్నారు. తమకు బ్రిడ్జి, రోడ్డు, తాగునీరు, విద్యుత్ సరఫరా, నిరంతరమైన విద్య సేవలను అందించాలని ఓటు హక్కును వినియోగించుకోకుండా వారి గ్రామాలోనే ఉండిపోయారు. ఉదయం 7 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎవరు పట్టించుకోలేదు. దీంతో 186 మందిలో కేవలం 40 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోగా 146 మంది ఓటు హక్కును వినియోగించుకోకుండా మిగిలిపోయారు. దీంతో పోలింగ్‌శాతం తగ్గిపోయింది అతి తక్కువ పోలింగ్ శాతంగా గ్రామం చోటుచేసుకుంది.

# 119 నియోజకవర్గాల్లో పోలింగ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏడు గంటలకు ప్రారంభమైంది. పోలింగ్ ప్రక్రియకు ముందు ఎన్నికల సిబ్బంది మాక్ పోలింగ్ నిర్వహించారు. రాష్ట్రవ్యా ప్తంగా 119 నియోజకవర్గాల్లో 2,290 మంది ఎన్నికల పోటీలో ఉన్నారు. మొత్తం పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 2,067 మంది పురుషులు కాగా, 222 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇద్దరు థర్డ్ జెండర్లు పోటీలో ఉన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.రాష్ట్రంలో 3,26,18,205 మంది ఓటర్లలో 1,63,13,268 మంది పురుష లు, 1,63,02,261మంది మహిళా ఓటర్లు ఉన్నా రు. పీడబ్ల్యూడీ (దివ్యాంగులు) ఓటర్లు 5,06,921, థర్డ్ జెండర్లు 2,676 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నారై ఓటర్లు 2,944 మంది నమోదు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ లో సినీ నటుడు అల్లు అర్జున్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ లోని బీఎస్ఎన్ఎల్ పోలింగ్ బూత్ లో అల్లు అర్జున్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్



లోని బిఎస్ఎన్ఎల్ పోలింగ్ బూత్లో లైన్లో నిలబడి మరీ అల్లు అర్జున్ తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. అక్కడ ఈవీఎం సమస్యతో ఇబ్బంది తలెత్తగా క్యూలైన్లో నిలబడిన అల్లు అర్జున్ ఎట్టకేలకు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓబుల్ రెడ్డి స్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకు నేందుకు వచ్చిన జూనియర్ ఎన్టీఆర్ ఓటర్లతో కలిసి క్యూలైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకో వటం ఆసక్తిని కలిగించింది. జూనియర్ ఎన్టీఆర్ తో పాటు, ఎన్టీఆర్ సతీమణి, ఎన్టీఆర్ తల్లి ఓటు వేయ డానికి వచ్చారు . షాద్ నగర్లో సినీ నటుడు ప్రకాష్ రాజ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. నిర్మల్ జిల్లా ఎల్లపెల్లి లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బంజారాహిల్స్ లో ఎమ్మెల్సీ కవిత తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇలా అభ్యర్థులతో పాటు సినీ సెలబ్రిటీలు, రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియో గించుకుంటున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని పిలుపునిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి ఓటేయాలని కవిత పిలుపునిచ్చారు. పట్టణాల్లో ఓటింగ్ తక్కువ అన్న చెడ్డపేరు ఉందని అన్నారు. కాబట్టి.. నగరాలు, పట్టణాల్లోని వారు, యువత పెద్దఎత్తున ఓటింగ్లో పాల్గొనాలని సూచించారు.

# ఎన్నికల బహిష్కరణ ఓట్లు వేసేందుకు నిరాకరణ

- పోలింగ్ కేంద్రాన్ని తరలించడంపై ఆగ్రహం
- రోడ్డు, తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్
- కలెక్టర్ రావాలని పట్టుబడిన జనం
- తహసీల్దార్‌తో రాతపూర్వకంగా రాయించుకున్న కొత్తపల్లి వాసులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం.. రోడ్డు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని.. వంతెనలు ఏర్పాటు చేయాలంటూ ఆదిలాబాద్ జిల్లాలో పలు గ్రామాల్లో ఓట్లు వేయడానికి జనం నిరాకరించారు. అధికారులు ఎంత సర్దిచెప్పినా వినలేదు. కలెక్టర్ గ్రామానికొచ్చి హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. సమస్యను పరిష్కరిస్తామంటూ తహసీల్దార్‌తో రాతపూర్వకంగా రాయించుకున్నాక బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామ ఆదివాసీ గిరిజనులు ఓట్లు వేశారు. గాదిగూడ మండలం కుండి గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఈసారి షేకుగూడకు మార్చారని చెప్పారు. దీంతో తాము ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. 2018 నుంచి ఇప్పటి వరకు తమ గ్రామాన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఐదు సంవత్సరాలుగా ఒక్క గ్రామసభ కూడా పెట్టలేదని కె.లక్ష్మణ్, టి.భీము, ఉప సర్పంచ్ కె.రాము, వార్డు మెంబర్ కె.అయ్యు, మారు, జైతు, ఎం.సోనేరావ్, యూత్ సభ్యులు దుర్గారావ్, జాదు, ఆకాష్, ఆయ్యు తెలిపారు. భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు తాగు నీటి సమస్య తీరిస్తేనే ఓట్లు వేస్తామని గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ఉదయాన్నే అధికారులు పోలింగ్ సామాగ్రితో గ్రామానికి వెళ్లారు. పోలింగ్ కేంద్రానికి గ్రామస్తులెవరూ రాకపోవడంతో అధికారులు వెంటనే తహసీల్దార్ నారాయణకు, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ లాల్‌సింగ్ నాయక్‌కు సమాచారం చేరవేశారు. వారు వచ్చి యువకులను, గ్రామస్తులకు సర్దిచెప్పినప్పటికీ వారు వినలేదు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని చెప్పినప్పటికీ ససేమిరా అన్నారు. కలెక్టర్ గ్రామానికి వచ్చి హామీ ఇస్తేనే ఓట్లు వేస్తామని తెగేసి చెప్పారు. గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనారోగ్యం బారిన పడి చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తీసుకుపోవడానికి 108 కూడా రాలేక ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల కోసమే అధికారులు, ప్రజా ప్రతినిధులు వస్తుంటారు తప్ప తమ గోడును విన్నవారు లేరని, అందుకే ఈసారి పోలింగ్‌ను బహిష్కరించాలని తీర్మానించుకున్నామని గ్రామస్తులు చెప్పారు. తహసీల్దార్, అధికారులు ఏమీ చేయలేక వెనుదిరిగారు. గ్రామానికి దశాబ్దాల తరబడి రోడ్డు, వంతెనలు లేక వర్షాకాలంలో బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని బోథ్ నియోజకవర్గంలోని బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామ ఆదివాసీ గిరిజనులు ఓటు వేయడానికి మొండికేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శంకర్, బజార్‌హత్నూర్ ఎస్ఐ బి.నరేష్ గ్రామానికి చేరుకొని సమస్య పరిష్కారానికి యత్నించారు. తాను ఎన్నికల అనంతరం గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ గ్రామానికి వచ్చి బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్‌ను పట్టుబట్టారు. కలెక్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తనదని, కాగితం మీద రాత పూర్వకంగా గ్రామ పటేల్ రాయించుకొని పోలింగ్‌ను ప్రారంభించారు. 11.30 గంటల సమయంలో పోలింగ్ ప్రారంభమైంది. అనంతరం గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు ఒకవేళ ఇచ్చిన హామీ నెరవేర్చని ఎడల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

# రోడ్డు వేయడంలేదని పోలింగ్ బహిష్కరణ

జూలూరుపాడు- ప్రభాత సూర్యుడు

"ఎలక్షన్లు వస్తున్నాయి, పోతున్నాయి కానీ మా గ్రామం తలరాత మారడం లేదు. ఎలక్షనప్పుడు ఓట్లు అడగడానికి మాత్రమే నాయకులు మా ఊరు వస్తున్నారు, ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకునే నాధుడే ఉండడు. 30 ఏండ్లుగా ఇదే జరుగుతోంది. మండలంలోని నల్ల బండబోడు నుంచి అనంతారం వరకు రోడ్డు సౌకర్యం లేదని, రోడ్డు మార్గం కల్పించాలని ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా, ఎన్నికలు అయ్యేవరకు సరే అంటూ, గెలిచిన తర్వాత, తమ ఊరినే పట్టించుకోవడం లేదని, రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఓట్లను బహిష్కరిస్తున్నామని నల్లబండ బోడు గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శారద, వైరా ఏసీపీ సాంబరాజు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చేరుకుని ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామంలో వందేండ్ల నుంచి తమ ముత్తాతల దగ్గర నుంచి సుమారు 60 కుటుంబాలు నివాసముంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఎన్నికలు వస్తేనే అధికారులకు, నాయకులకు తమ గ్రామం గుర్తుకొస్తుందని, లేకపోతే మా గ్రామాన్ని పట్టించుకునే నాధుడే లేరని అధికారుల ముందు వాపోయారు.

ఎన్నో దఫాలుగా దరఖాస్తుల రూపంలో అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఓట్ల బహిష్కరణకు సిద్ధమయ్యామని తెలిపారు. రోడ్డు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, గర్భిణీలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈ క్రమంలో జూలూరుపాడు తహసీల్దార్ శారద గ్రామస్తులతో మాట్లాడుతూ.. మీ ఊరికి రోడ్డు వేయించడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఓటు వేసేందుకు కదిలారు. రోడ్డు వేయడంలేదని పోలింగ్ బహిష్కరణ తహసీల్దార్ హామీతో ఓటు వేసిన గ్రామస్తులు

'ఎలక్షన్లు వస్తున్నాయి, పోతున్నాయి కానీ మా గ్రామం తలరాత మారడం లేదు. ఎలక్షనప్పుడు ఓట్లు అడగడానికి మాత్రమే నాయకులు మా ఊరు వస్తున్నారు, ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకునే నాధుడే ఉండడు. 30 ఏండ్లుగా ఇదే జరుగుతోంది. మండలంలోని నల్ల బండబోడు నుంచి అనంతారం వరకు రోడ్డు సౌకర్యం లేదని, రోడ్డు మార్గం కల్పించాలని ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా, ఎన్నికలు అయ్యేవరకు సరే అంటూ, గెలిచిన తర్వాత, తమ ఊరినే పట్టించుకోవడం లేదని, రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఓట్లను బహిష్కరిస్తున్నామని నల్లబండ బోడు గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శారద, వైరా ఏసీపీ సాంబరాజు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చేరుకుని ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామంలో వందేండ్ల నుంచి తమ ముత్తాతల దగ్గర నుంచి సుమారు 60 కుటుంబాలు నివాసముంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఎన్నికలు వస్తేనే అధికారులకు, నాయకులకు తమ గ్రామం గుర్తుకొస్తుందని, లేకపోతే మా గ్రామాన్ని పట్టించుకునే నాధుడే లేరని అధికారుల ముందు వాపోయారు.

ఎన్నో దఫాలుగా దరఖాస్తుల రూపంలో అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఓట్ల బహిష్కరణకు సిద్ధమయ్యామని తెలిపారు. రోడ్డు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, గర్భిణీలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈ క్రమంలో జూలూరుపాడు తహసీల్దార్ శారద గ్రామస్తులతో మాట్లాడుతూ.. మీ ఊరికి రోడ్డు వేయించడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఓటు వేసేందుకు కదిలారు.

# ఓటెత్తిన సెలబ్రిటీలు




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


తెలుగు చిత్రసీమకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్. ఈ సిటీ తెలంగాణకు మాత్రమే రాజధాని కాదు... తెలుగు సినిమా పరిశ్రమకు అడ్డా కూడా! చిత్రసీమ ప్రముఖులు చాలా మంది నివసించే నగరం ఇది! వాళ్ళకు ఇక్కడ ఓటు హక్కు ఉంది. ఈ రోజు తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో వాళ్ళందరూ ఉదయాన్ని తమ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.కుటుంబంలో కలిసి వచ్చిన చిరంజీవిమెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులు ఇవాళ ఉదయం ఎనిమిది గంటలకు జూబ్లీ హిల్స్ క్లబ్బులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కుటుంబంతో కలిసి ఆయన వచ్చారు. చిరు వెంట కుమార్తె శ్రీజ కూడా ఉన్నారు. చిరంజీవి తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు ఓటు హక్కు వినియోగించుకుంటారని సమాచారం ఇచ్చారు. ఓటు వేయడం కోసం మైసూరులో జరుగుతున్న 'గేమ్ ఛేంజర్' చిత్రీకరణకు చిన్న విరామం ఇచ్చి మరీ ఆయన హైదరాబాద్ వచ్చారు.సగం మంది ఓటు వేయరా? - ఎన్టీఆర్ ప్రశ్నమ్యాన్ ఆఫ్ మాసెస్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సైతం ఉదయాన్ని ఓటు వేశారు. భార్య ప్రణీత, తల్లి శాలినితో కలిసి పోలింగ్ బూట్ వద్దకు వచ్చారు. క్యూ లైనులో నిలబడిన ఎన్టీఆర్... అక్కడకు వచ్చిన మీడియా, అభిమానులతో సరదాగా ముచ్చటించారు. 'సగం మంది ఓటు వేయరా?' అని ప్రశ్నించారు.ఓటు వేయండి - ప్రజలకు అల్లు అర్జున్ విజ్ఞప్తిసినిమా ప్రముఖులలో అందరి కంటే ముందు పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ఉదయం ఏడు గంటలకు తన ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆయన వచ్చారు. సుమారు 20 నిమిషాల పాటు క్యూ లైనులో నిలబడ్డారు. ఓటు వేసిన తర్వాత వేలిపై ఉన్న సిరా గుర్తును ఫోటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బాధ్యతగా ఓటు వేయమని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆస్కార్ పురస్కార గ్రహీత ఎంఎం కీరవాణి, దర్శకేంద్రుడు కె. రాఘవేంద్ర రావు, హీరో సుమంత్ తదితరులు సైతం ఉదయాన్ని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సతీమణి ఊహ, కుమారుడు రోషన్ మేకతో కలిసి శ్రీకాంత్ పోలింగ్ బూత్ వద్దకు విచ్చేశారు. ఉదయం ఓటు వేశారు.మరికొంత మంది ప్రముఖులు ఓటు వేయడానికి రెడీ అవుతున్నారు. సినిమా తారలు అందరూ క్యూ లైనులో నిలబడి మరీ ఓటు వేస్తున్నారు. మరి, మీ సంగతి ఏంటి? ప్రజలు అందరూ ఓటు వేసి తమ బాధ్యతను నిర్వర్తించాలని సినీ ప్రముఖులు పరోక్షంగా సందేశం ఇస్తున్నారు.
























# నాగార్జున సాగర్ ప్రాజెక్టు దగ్గర ఉద్రిక్తత



నల్గొండ- ప్రభాత సూర్యుడు

నాగార్జున సాగర్ ప్రాజెక్టు దగ్గర గురువారం తెల్లవారుఝామున ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి నీటి విడుదలకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటాక అక్రమంగా ప్రాజెక్టులోనికి చొరబడి డ్యామ్‌కు ముళ్లకంచె పెట్టారు. సాగర్ ప్రాజెక్టుకు ఉన్న 26 గేట్లలో సగ భాగం.. అంటే 13వ గేట్ వరకు ప్రాజెక్టు తమ పరిధిలోకి వస్తుందని ఏపీ పోలీసులు వాదిస్తున్నారు. నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు దాదాపు 500 మంది దాకా పోలీసు సిబ్బందితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చారు. వారిని డ్యామ్ కు కాపలాగా ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందిపై దాడి చేసి.. వారి మొబైల్ ఫోన్లు కూడా లాక్కున్నారు. 13వ గేట్ వద్దకు చేరుకొని ముళ్ల కంచె పెట్టి.. డ్యామ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.. ఏపీ పోలీసులు.సాగర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్దమయ్యారు. పల్నాడు జిల్లాలో భారీగా మోహరించి రాత్రి సమయంలో సాగర్ కు వెళ్లారు. సాగర్ వద్ద మీడియాపై పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డి జులుం ప్రదర్శించారు. మీడియా ప్రతినిధుల ఫోన్లు కూడా ఏపీ పోలీసులు లాక్కున్నారు. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఏపీ పోలీసులు వెళ్లడంపై ఉత్కంఠ నెలకొని ఉంది.ఇదంతా కేసీఆర్ పనే - ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిసాగర్ డ్యాంపై పోలీసుల హడావిడిపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. సాగర్ డ్యాంపై పోలీసుల డ్రామా కేసీఆర్ పనే అని విమర్శించారు. ఓడిపోతున్నారని కేసీఆర్ కి అర్థమై తెలంగాణ సెంటిమెంట్ రగిలిస్తున్నారని ఆరోపించారు. ఇన్ని రోజులు లేని హడావిడి పోలింగ్ రోజే ఎందుకు అవుతోందని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ, ఏపీ పోలీసులు కలిసి చేసే డ్రామాలు ఎవరూ నమ్మవద్దని కోరారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఎన్నికల కోసం వాడుతున్నారు. కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని.. 90 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కోమటిరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.స్పందించిన ఎన్నికల కమిషనర్నాగార్జున సాగర్ డ్యాం వద్ద జరుగుతున్న హైటెన్షన్ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ స్పందించారు. రాజకీయ నేతలు ఎవరూ ఆ విషయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని అన్నారు. డ్యాం దగ్గర జరుగుతున్న వ్యవహారాన్ని పోలీసులు చూసుకుంటారని చెప్పారు. వికాస్ రాజ్ హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ లో ఓ పోలింగ్ కేంద్రంలో తన సతీమణితో కలిసి ఓటు వేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.కుట్రలు పనిచేయవు - రేవంత్ నాగార్జున సాగర్ ఘటనపై స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్పందించారు. కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు దగ్గర ఉద్రిక్తతలు కేసీఆర్ కుట్ర అని రేవంత్ ఆరోపించారు. రాజకీయ లబ్ది కోసం చేస్తున్న కేసీఆర్ పన్నాగాలు ఫలించబోవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సమర్థంగా నీటి పంపకాల విషయాన్ని పరిష్కరిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.పోలింగ్ రోజు ఇలాంటి ఘటనలకు తెరలేపారు. తెలంగాణ ప్రజలు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఏం ఆశించి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తొమ్మిదిన్నర ఏళ్లుగా కేసీఆర్ ఈ సమస్యను పరిష్కరించకపోవడంవల్లే ఇలాంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయి. వీటన్నింటికి శాశ్వత పరిష్కారం ప్రజామోదయోగ్యమైన ప్రభుత్వం ఏర్పడటమే. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తాం. దేశాల మధ్య నీటి వాటాలు పంచుకుంటున్నాం.. అలాంటిది రాష్ట్రాల మధ్య వాటాలు పంచుకోలేమా..?నీటి వాటాలు, ఆస్తుల పంపకాల విషయంలో కాంగ్రెస్ సమయస్ఫూర్తితో, సమన్వయంతో వ్యవహరిస్తుంది. అవసరమైనప్పుడు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ ను కేసీఆర్ ఉపయోగించుకుంటున్నారు. రాజకీయ లబ్ది కోసం చేస్తున్న కేసీఆర్ పన్నాగాలు ఫలించవు. కేసీఆర్ వి దింపుడు కల్లం ఆశలే.. ఇలాంటి కుట్రలు ఎన్నికలపై ప్రభావం చూపాల్సిన అవసరం లేదు. వివాదాలను సామరస్యంగా సరైన పరిష్కారం చూపించే బాధ్యత మాది" అని రేవంత్ రెడ్డి మాట్లాడారు.

## రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు...



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

పోటీ ఏదైనా బెట్టింగ్ ఖాయం అన్నట్లుగా ప్రస్తుత పరిస్థిత?మారిపోయింది. తెలంగాణ ఎన్నికలపైనా అదే విధమైన బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. క్రికెట్, ఇతరత్రా పోటీలపై బెట్టింగులు నిర్వహించిన ఆన్లైన్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు.. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై వాటి కన్ను పడింది. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై బరిలోకి దిగిన పందెం రాయుళ్లు? కాయ్ రాజా కాయ్ అంటూ జోరుగా బెట్టింగ్స్ కాస్తున్నారు. ఈ సారి పలానా పార్టీ అధికారంలోకి రాబోతోందని, పలానా నియోజకవర్గంలో పలానా అభ్యర్థి గెలవబోతున్నారంటూ భారీగా పందాలు వేస్తున్నారు. వందకు వెయ్యి, వెయ్యికి లక్ష అంటూ బెట్టింగ్ బంగార్రాజులు పందేలు కాస్తున్నారు. పెద్ద లీడర్లు తలపడుతున్న నియోజకవర్గాల్లో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందన్న పందేలు కూడా కాస్తున్నారు. లక్షలు కాదు.. కోట్లలో బెట్టింగ్స్ జరుగుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఏ పార్టీ గెలుస్తుంది. ఎవరు అధికారంలోకి రాబోతున్నారు. రాష్ట్రంలో ఎవరిని చూసినా ఇదే చర్చ. ఊరు వాడా, పల్లె పట్నం అని తేడా లేకుండా ప్రతి గల్లిలోనూ ఏ నలుగురు గుమిగూడినా ఇదే చర్చ. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల్లో ఏ పార్టీ, ఎన్ని సీట్లు సాధిస్తుందనే అంచనాలపై వేర్వేరు బెట్టింగ్ సంస్థలు పందేలు నిర్వహిస్తున్నాయి. ప్రముఖులు ప్రచారకర్తలుగా ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లకు విస్తృత ప్రచారం కల్పిస్తుండటం, వెబ్‌సైట్లు, బస్టాపులు, ఆటోలపై వారి ప్రకటనలు ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలు ఎన్ని స్థానాల్లో గెలుస్తాయి.. ఎన్ని సీట్లతో సరిపెట్టుకుంటాయి. అంటూ ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్థలు ప్రకటనలు ప్రదర్శిస్తున్నాయి. డిసెంబరు 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయని.. పందెంలో గెలిచిన వారు అంతకంత డబ్బు సంపాదించుకోవచ్చని ఊరిస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిత్యం రకరకాల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే బెట్టింగ్ సంస్థలు అంతకు మించి హడావుడి పెంచాయి. తెలంగాణలోనే కాదు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సర్వేలు చేయించి మరీ పందాలు కాస్తున్నారు బుకీలు. కేసీఆరే సీఎం అవుతారని.. హంగ్ వస్తుందని.. కాంగ్రెస్ గెలుస్తుందంటూ కోట్లాది రూపాయల్లో బెట్టింగులు కాస్తున్నారు. బీఆర్ఎస్.. కాంగ్రెస్ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయనే దాని పైన కూడా పందాలు జరుగుతున్నాయి. రేవంత్ రెడ్డి రెండు చోట్ల గెలుస్తాడా... కేసీఆర్ కు ఎంత మెజార్టీ వస్తుంది.. కోమటిరెడ్డి బ్రదర్స్, మైనంపల్లి గెలుస్తారా లేదా అన్న అంశాలపైనా బెట్?టంగ్ జరుగుతోంది. మూడో తేదీ లోపు వేల కోట్ల బెట్టింగ్ జరిగే అవకాశం ఉందని అంచనా .

## 70కిపైగా సీట్లతో అధికారంలోకి వస్తాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మూడో తేదీన ఎన్నికల ఫలితాలు వస్తాయనీ, ఆ రోజున విజయం సాధించేది బీఆర్ఎస్సేనని ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 70కి పైగా స్థానాల్లో విజయం సాధించి హాట్రిక్ కొడతామని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూసి కంగారు పడాల్సిన పని లేదని చెప్పారు. 'ఈరకమైన ఎగ్జిట్ పోల్స్‌ను గతంలోనూ చూశాం. ఎగ్జిట్ పోల్స్ తప్పు అని నిరూపించడం మాకు కొత్తేమీ కాదు. డిసెంబర్ 3న 70కి పైగా స్థానాలతో విజయం సాధిస్తాం. ఎగ్జిట్ పోల్స్‌ను చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. కొన్ని మీడియా సంస్థలు సర్వేలు చేయకుండా.. ఏదో 200 మందిని అడిగినదాన్నే గొప్పగా చేసి చూపిస్తాయి. గతంలో 5 మీడియా సంస్థలు సర్వేలు చేస్తే.. అందులో ఒక్కటే నిజమైంది' అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజలు ఇంకా లైన్‌లో ఉండి ఓట్లు వేస్తుంటే.. అప్పుడే ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడటమేంటని ప్రశ్నించారు. అస్సలు ఏ లాజిక్‌తో ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. ఇది హాస్యాస్పదంగా అనిపిస్తుందని చెప్పారు. ఒకవేళ డిసెంబర్ 3న ఎగ్జిట్ పోల్స్ తప్పు అయితే.. తప్పు జరిగిందని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెబుతారా? అని ఎగ్జిట్ పోల్స్ ప్రచురించిన మీడియా సంస్థలను ప్రశ్నించారు. ఎవ్వరూ అయోమయానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. వందకు వంద శాతం అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. గత 90 రోజులుగా కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా పోలింగ్ శాతం తేలలేదని.. ఫైనల్ పోలింగ్ ఎంత జరిగిందనేది శుక్రవారం ఉదయం తేలుతుందని తెలిపారు. ఎంత పోలింగ్ అయ్యింది? ఎక్కడ ఎంత అయ్యింది? ఏ నియోజకవర్గంలో ఎంత అయ్యిందనేదాన్ని బట్టి అనాలసిస్ చేసుకోవచ్చన్నారు.

## జనవరి 1 నుంచి మరో ఐదేళ్లు




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని పేద ప్రజలకు శుభవార్త చెప్పింది. 2024 జనవరి 1 నుంచి మరో 5 సంవత్సరాల పాటు 81 కోట్ల మంది అర్హులకు నెలకు ఒకరికి 5 కిలోల చొప్పున రేషన్ ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించింది. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద మరో ఐదేళ్లపాటు పేదలకు ఉచితంగా 5 కిలోల బియ్యం అందించనున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనకు వచ్చే ఐదేళ్లలో రూ.11.8లక్షల కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ నిర్ణయాలను అనురాగ్ ఠాకూర్ మీడియాకు తెలిపారు.ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనను కేంద్రం.. దేశంలో కొవిడ్ విజృంభించిన సమయంలో పేదలకు అండగా ఉండేందుకు 2020లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అర్హులకు ఒకరికి 5కిలోల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ఈ పథకం 2023 డిసెంబర్ 31తో గడువు ముగియగా.. కేంద్ర కేబినెట్తాజా నిర్ణయంతో మరో ఐదేళ్లపాటు కొనసాగనుంది.ఇక, కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్ను రాబడిని పంచుకోవడంపై నిర్ణయం తీసుకునే 16వ ఆర్థిక సంఘం విధివిధానాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అనురాగ్ ఠాకూర్తెలిపారు. 16వ ఆర్థిక సంఘం తన నివేదికను 2025 అక్టోబర్ నాటికి సమర్పిస్తుందన్నారు. 2026 ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే ఐదేళ్ల కాలానికి సిఫార్సులు చెల్లుబాటు అవుతాయని చెప్పారు.కాగా, డ్వాక్రా గ్రూపులకు వ్యవసాయ డ్రోన్‌లను అందించే పథకానికి కేంద్రం మంత్రివర్గం గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. 15వేల డ్వాక్రా గ్రూపులకు డ్రోన్లు అందించి.. వారికి శిక్షణ ఇవ్వనుంది. వ్యవసాయ అవసరాల కోసం రైతులకు ఈ డ్రోన్లను డ్వాక్రా గ్రూపులు అద్దెకు ఇవ్వనున్నాయి. 2023-24 నుంచి 2025-2026 మధ్యకాలంలో ఎంపిక చేసిన 15,000 డ్వాక్రా గ్రూపులకు డ్రోన్లు అందించనున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఇది ఇలావుండగా, కేంద్ర కేబినెట్ సమావేశంలో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ గురించి చర్చకు వచ్చిందని అనురాగ్ ఠాకుర్ తెలిపారు. మోడీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు. ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో ఉన్నా కూడా.. సొరంగం వద్ద జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్ గురించి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్సింగ్ ధామితో రోజుకు రెండు సార్లు మాట్లాడినట్లు మీడియా అడిగిన ప్రశ్నకు ఠాకుర్సమాధానమిచ్చారు.

## రాజకీయ లబ్ది కోసం కేసీఆర్ పన్నాగాలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఘటనపై రేవంత్‌రెడ్డి



రాజకీయ లబ్ది కోసం చేస్తున్న సీఎం కేసీఆర్ పన్నాగాలు ఫలించవని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆయనవి దింపుడు కల్లం ఆశలేనని చెప్పారు. ఇలాంటి కుట్రలు ఎన్నికలపై ప్రభావం చూపాల్సిన అవసరం లేదన్నారు. వివాదాలను సామరస్యంగా సరైన పరిష్కారం చూపించే బాధ్యత మాది అన్నారు. గురువారం కొడంగల్ నియోజకవర్గంలో ఓటు వేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. నాగార్జున సాగర్ ఘటనపై స్పందించారు. తెలంగాణ ప్రజలు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. ఏం ఆశించి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో కండ్లకు కట్టినట్టు కనిపిస్తున్నదని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోరారు.తొమ్మిదేండ్లుగా కేసీఆర్ ఈ సమస్యను పరిష్కరించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వీటన్నింటికి శాశ్వత పరిష్కారం ప్రజామోదయోగ్యమైన ప్రభుత్వం ఏర్పడటమేనని చెప్పారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తామన్నారు. దేశాల మధ్య నీటి వాటాలు పంచుకుంటామన్నారు. అలాంటిది రాష్ట్రాల మధ్య వాటాలు పంచుకోలేమా? అని ప్రశ్నించారు. నీటి వాటాలు, ఆస్తుల పంపకాల విషయంలో కాంగ్రెస్ సమయస్ఫూర్తి,సమన్వయంతో వ్యవహరిస్తుందన్నారు. అవసరమైనప్పుడు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ ఉపయో గించుకుంటున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు.

## సాగర్ డ్యామ్‌పై హైడ్రామా కేసీఆర్ పనే : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాగర్ డ్యామ్‌పై పోలీసుల హైడ్రామా సీఎం కేసీఆర్ పనేనని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోతున్నారంటూ కేసీఆర్‌కు అర్థమై తెలంగాణ సెంటిమెంట్ రగిలిస్తున్నారని విమర్శించారు. ఇన్ని రోజులు లేని హడావిడి పోలింగ్ రోజే ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ, ఏపీ పోలీసులు కలిసి చేసే డ్రామాలు ఎవరూ నమ్మవద్దని కోరారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఎన్నికల కోసం వాడుతున్నారని విమర్శించారు. 90 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కవిత ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని డీఏవీ స్కూల్ పోలింగ్ స్టేషన్లలో తన ఓటును వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత కోడ్ ఉల్లంఘించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కోరారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215